క్లుప్తంగా

4న మండల సర్వసభ్య సమావేశం

నంద్యాల(రూరల్): ఈ నెల 4వ తేదీన నంద్యాల మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ బుధవారం తెలిపారు. ఎంపీపీ శెట్టి ప్రభాకర్ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులతో పాటు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. ముఖ్యంగా మండల స్థాయి అధికారులందరూ తమ శాఖకు సంబంధించిన పూర్తి ప్రగతి నివేదికలను సమావేశానికి తీసుకురావాలని సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులతో ఉపాధ్యాయులు

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం ఉన్నత పాఠశాల విద్యార్థులు త్రోబాల్ పోటీల్లో ప్రతిభ చూపి భళా అనిపించారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో నంద్యాలలో జరిగిన ఉమ్మడి కర్నూలు జిల్లా త్రోబాల్ అండర్–14 విభాగంలో పీవీ శ్రీహరి ప్రతిభ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. గతేడాది డిసెంబరర్ 17 18, 19 తేదీల్లో వైఎస్సార్ జిల్లా కమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి అండర్–17 విభాగంలో చందన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. హెచ్ఎం మురళీధర్ క్రీడాకారులతో పాటు పీడీ శ్రీధర్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు సుధాకర్, నారరాజు, గంగాధర్, ధరణీదేవి, అబ్దుల్ రహీం, మధుసూదన్, హసీన పాల్గొన్నారు.

పశుగ్రాసం ట్రాక్టరు బోల్తా


జేసీబీతో ట్రాక్టర్‌ను పక్కకు తీస్తున్న దృశ్యం

రుద్రవరం: రుద్రవర–కొండమాయపల్లె ఆర్అండ్‌బీ రోడ్డుపై బుధవారం పశుగ్రాసం తరలించే ట్రాక్టరు ప్రమాదవశాత్తు బోల్తా పడింది. అయితే ఆ సమయంలో అటు వైపు ఎలాంటి వాహనాలు, ప్రజలు లేక పోవడంతో ప్రమాదం తప్పింది. మండల కేంద్రానికి చెందిన ఉసేన్ అనే రైతు మాచర్లకు పశుగ్రాసాన్ని ట్రాక్టరుపై తరలిస్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న మరో వాహనానికి దారి ఇచ్చే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. గ్రాసంతో సహా ట్రాక్టర్ రోడ్డుకు అడ్డంగా పడటంతో గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే సంబంధిత రైతు జేసీబీ ద్వారా ట్రాక్టరును పక్కకు తొలగించడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

కూలీలకు గుర్తింపు కార్డులు

శిరివెళ్ల: ఉపాధి హామీ పథకం కూలీలకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని లేబర్ ఆఫీసర్ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం గుర్తింపు కార్డులపై ఏపీఓ రామసుబ్బయ్యతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ భవన కార్మికుల తరహాలో ఉపాధి కూలీలకు గుర్తింపు కార్డులు జారీ చేసి బీమా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఆళ్లగడ్డ ఏరియాలో 7,200 మంది కూలీలున్నారని, గుర్తింపు కార్డుల జారీకి గ్రామాల్లో సభలు నిర్వహించి అవగాహన కల్పిస్తామని చెప్పారు. అలాగే నంద్యాల కార్యాలయంలో కూడా గుర్తింపు కార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈసీ సుబ్బరాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మిల్లీ కౌన్సిల్ మీడియా కార్యదర్శి నియామకం

నంద్యాల(వ్యవసాయం): ఆలిండియా మిల్లీ కౌన్సిల్ రాష్ట్ర మీడియా కార్యదర్శిగా పట్టణానికి చెందిన నాజర్ అబ్దుల్ జావీద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఇటీవల కర్నూలులో రిసాల్దార్ మసీదులో కార్యవర్గ సమావేశం నిర్వహించగా ఏపీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదిర్ నిజామీ, జాతీయ కార్యదర్శి హజరత్ సయ్యద్ ముస్తఫాపిపయీ జిలానీ పాల్గొన్నారని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర మీడియా కార్యదర్శిగా తనను ఎన్నుకున్నారని వివరించారు.

జీఓ రద్దు చేయాలి

నంద్యాల(అర్బన్): అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించకూడదని ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 1ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం సీఐటీయూ పట్టణ కమిటీ సమావేశం ఉపాధ్యక్షులు తోట మద్దులు అధ్యక్షతన నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ ర్యాలీ, సభలను నియంత్రిస్తూ జీఓ విడుదల చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంటలింగం, లక్ష్మణ్, సునీత, నాగరాణి, గోపాల్, దస్తగిరి పాల్గొన్నారు.

నిప్పంటుకొని వ్యక్తికి గాయాలు

దొర్నిపాడు : మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామానికి చెందిన వెంకటపతి అనే వ్యక్తి ఇంట్లో వంట చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గాయపడ్డాడని ఎస్‌ఐ తిరుపాల్ బుధవారం తెలిపారు. ప్రస్తుతం కర్నూలులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

దిగుబడి మెరిసె.. రైతు మురిసె

సమృద్ధిగా వర్షాలు, తక్కువగా తెగుళ్లు, అనుకూలించిన వాతావరణం, ఆశించిన స్థాయిలో దిగుబడి, గిట్టుబాటు ధర లభించడం.. వెరసి అన్నదాత లాభాల బాట పట్టాడు. రెండేళ్లుగా వరి పంట సాగు తగ్గించిన రైతన్నలు, ప్రస్తుతం రబీలో భాగంగా మళ్లీ పూర్వపు స్థితిలో వరి సాగుకే మొగ్గు చూపారు. కారణం దిగుబడి, ధర మునుపెన్నడూ లేనంతగా ఉండటమే. అలాగే మొక్కజొన్న, మినుము తదితర పంటలు కర్షకుడి చెమట చుక్కకు ప్రతిఫలమిచ్చాయి.

- అనుకూలించిన పరిస్థితులు
- లాభాల బాటలో రైతన్నలు


అహోబిలం రహదారిలో మొక్కజొన్న ధాన్యాన్ని రోడ్డుపై ఆరబోస్తున్న రైతులు


రుద్రవరం పెద్దరాజు చెరువు కింద రబీలో భాగంగా వరి నాట్లు వేస్తున్న కూలీలు

రుద్రవరం: పంటల సాగులో రైతన్నల్లో సందిగ్ధత నెలకొంది. వాతావరణం అనుకూలించకపోవడం, తెగుళ్ల వెంటాడటం, దిగుబడి అంతంత మాత్రంగానే వస్తుండటం, ధర వెక్కిరిస్తుండటంతో ఏమి చేయాలో వారికి పాలుపోయేది కాదు. అయితే 2022 వ్యవసాయ నామ సంవత్సరంగా మారింది. కొన్నేళ్లుగా లాభాలు అంతంత మాత్రంగానే ఉన్న వారికి గతేడాది కలిసి రావడంతో భారీగా మిగిలింది. ఇందులో వరి ప్రథమ స్థానంలో నిలిచింది. నాలుగేళ్ల నుంచి వరి దిగుబడులు ఎకరాకు 30 బస్తాలు రావడమే గగనమైంది. అలాంటిది ఈ ఏడాది 40 – 45 బస్తాలు వచ్చాయి. కోతల సమయంలో 75 కేజీల బస్తా రూ.1100, రూ.1200 మాత్రమే లభించేది. మార్చి, మే నెలలో మాత్రమే రూ.1600 పలికేది. ప్రస్తుతం పచ్చి ధాన్యాన్ని రూ.1650 – 1800 ప్రకారం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రూ.2300 పలుకుతోంది. ఇక మొక్కజొన్న ఎకరాకు 30 క్వింటాళ్లకు పైగా దిగుబడి రావడంతో కర్షకుల్లో ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మొక్కజొన్నను మొదట్లో రూ.1,900 ప్రకారం కొనుగోలు చేయగా ప్రస్తుతం రూ.2,200లకు పైగా పలుకుతోంది. గతంలో చివరకు అత్యధికంగా రూ.1,850 వరకు లభించేది. ఈ ఏడాది ఈ ధర మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఖరీఫ్‌నకు సమానంగా రబీలో పంటల సాగు..

ఖరీఫ్‌లో భాగంగా మండలంలో ఏడు వేల హెక్టార్లలో వరి పంట, మొక్కొన్న నాలుగు వేల హెక్టార్లలో సాగైంది. డిసెంబర్ మధ్య నుంచి ఈనెల తొలివారం వరి కోతలు సాగగా అదే సమయంలో నాట్లు కూడా ప్రారంభమయ్యాయి. సాధారణంగా రబీలో పంటల సాగు తగ్గడం సాధారణమే అయితే ఈ ఏడాది దిగుబడి, ధరలు ఊరిస్తుండటంతో అన్నదాతలు మళ్లీ ఖరీఫ్‌నకు సమానంగా పంటలు సాగు చేస్తున్నారు. ఏటా సంక్రాంతి తరువాత అరకొరగా నాట్లు పడేవి. ప్రస్తుతం ఇంకా మొక్కజొన్న విత్తనంతో పాటు వరి నాట్లు సాగుతున్నాయంటే అన్నదాతలు ఎంతలా ఇష్టంతో సాగు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. వీటితో పాటు మినుము కూడా సాగు చేస్తున్నారు. సాగునీరు అందుబాటులో లేనివారు, ఖరీఫ్ కోతల అనంతరం పొలాల్లో ఉన్న తడి ఆధారంగా మినుము సాగు చేశారు. అలాగే పెట్టుబడి పెట్టలేని, ఎక్కువగా శ్రమ తీసుకోకపోవడంతో పాటు ధర కూడా బాగా లభిస్తుందని ఈ పంట వైపు కొందరు రైతులు మొగ్గు చూపుతున్నారు.

మొదలైన రెండో పంట కోతలు..

ఖరీఫ్‌లో ముందస్తుగా మొక్కజొన్న సాగు చేసిన వారికి కోతలు కూడా ముందుగానే మొదలయ్యాయి. దీంతో వారు వెంటనే మళ్లీ మొక్కజొన్న సాగు చేశారు. ఇలా ముందస్తుగా సాగు చేసిన వారికి ప్రస్తుతం పంట చేతికి రావడంతో కోతలు ప్రారంభమయ్యాయి. ఇలా రెండో పంట కోతలు మొదలు కావడంతో ఈ ధాన్యాన్ని వ్యాపారులు రూ.2,200 ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. అలాగే దిగుబడి కూడా ఎకరాకు 40 క్వింటాళ్లకు పైగా వస్తోంది. ఏది ఏమైతేనేమి.. ఈ సారి దిగుబడి బాగా రావడం, ధర లభించడంతో అన్నదాత కొంత మిగులు చూడగలిగాడు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోండి


కూలీలతో మాట్లాడుతున్న పీడీ రామచంద్రారెడ్డి

రుద్రవరం:ఉపాధి పనులను సద్వినియోగం చేసుకొని జీవనాన్ని మెరుగు పరచుకోవాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని ఎల్లావత్తుల వద్ద బుధవారం కాల్వలో కూలీలు చేస్తున్న పూడికతీత పనులను పరిశీలించారు. ఆయన కూలీలతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేసి రూ.257 వేతనం తీసుకోవాలని సూచించారు. ఉదయాన్నే వెళ్లి నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేసి త్వరగా ఇళ్లకు చేరుకోవాలని చెప్పారు. మండలంలో మొత్తం 850 మంది కూలీలు పనులు చేస్తున్నారని, ఎల్లావత్తులలో 55 మంది పనుల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీఓ ప్రతాప్,ఈసీ సుబ్బన్న ఉన్నారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

రుద్రవరం: మండలంలోని నర్సాపురం గ్రామంలో దాదాపు రూ.16 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవన నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. జెడ్పీటీసీ మాధవి, రుద్రవరం సహకార సంఘ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, గ్రామ పెద్దలు ప్రసాదరెడ్డి,శివనాగయ్య,లక్ష్మీనారాయణరెడ్డిలతో పాటు వీఆర్వో ఓబయ్య,సచివాలయ ఉద్యోగులు శ్రీనివాసులురెడ్డి,సుజాత,అంగన్‌వాడి సిబ్బంది సునీత,సబ్బలక్ష్మి భూమి పూజలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో శ్రీ కృష్ణుడు

నంద్యాల(వ్యవసాయం): మాఘమాసంలో వచ్చే ఏకాదశిని భీష్మ ఏకాదశి అంటారు. పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి వేడకలు నిర్వహించారు. శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలకంరించారు. సాయంత్రం టీటీడీ దేవస్థానం వ్యాఖ్యాత డాక్టర్ దివి హయగ్రీవాచారి సామూహిక విష్ణుసహస్ర పారాయణం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ శ్రీ విష్ణు సహస్రనామాలను భీష్మ పితామహుడు పాండవులకు చేసిన ఈ రోజునే ఉపదేశించారని. సహస్రనామాల పవిత్రత, విశిష్టతను భక్తులకు తెలియజేశారు. సమాజ్ సభ్యులు సూరయ్య, శ్రీనివాస్, వసంత్ పాల్గొన్నారు. అలాగే పద్మావతి నగర్‌లోని శ్రీకృష్ణ ఆలయంలో భీష్మ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే శ్రీ కృష్ణుడి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, గంధాభిషేకం జరిపించారు. అనంతరం స్వామివారిని తులసీ కుసుమాలతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

తొలిరోజే వేగంగా పింఛన్ల పంపిణీ


ఉయ్యాలవాడలో ఫక్రుద్దీన్ బాషాకు పింఛన్ అందజేస్తున్న లాలమ్మగారి హుసేని, వలంటీర్

దొర్నిపాడు: మండలంలో బుధవారం పింఛన్ల పండుగ వేగంగా సాగింది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. మండలంలో 3,728 పింఛన్లకు గాను మొదటి రోజు 3,536 మందికి పంపిణీ చేశారు. కొందరు లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో వందశాతం పూర్తికాలేదని ఎంపీడీఓ నాగఅనసూయ తెలిపారు.

ఉయ్యాలవాడ : వైఎస్సార్ ఫించన్ కానుక పంపిణీ బుధవారం తెల్లవారుజాము నుంచే మొదలైంది. లబ్ధిదారులకు గ్రామ సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు, వలంటీర్లు ఫించన్ సొమ్ము అందజేశారు. పెరుసగా పెంచిన సొమ్మును అందుకోవడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో మొదటి రోజు 86 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు.


ఆర్.పాంపల్లె సమీపంలో విరగ్గాసిన ఎర్ర జొన్న

ఆశాజనకంగా జొన్న

ఉయ్యాలవాడ : ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో జొన్న సాగు రైతులకు కలిసి వచ్చింది. సకాలంలో వర్షాలు కురవడం, వాతావరణం అనుకూలించడంతో పంట ఏపుగా పెరిగింది. దీంతో ఎకరాకు 22 నుండి 26 బస్తాలు దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో 244 ఎకరాల్లో జొన్న పంట సాగైంది. మహేంద్ర రకం ఎక్కువ శాతం రైతులు సాగు చేశారు. పంట మరో వారం రోజుల్లో చేతికి అందుతుండడంతో రైతులు ఆ ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు. జొన్న పంటకు మార్కెట్‌లో మంచి ధర ఉంది. తెల్ల జొన్నలు క్వింటా రూ. 2,600 నుంచి రూ. 2,800, ఎర్ర జొన్న క్వింటా రూ. 3,200 నుంచి రూ. 3,500 వరకు పలుకుతోంది. ధర నిలకడగా ఉంటే పంట విక్రయిస్తే పెట్టుబడులు పోనూ నికర ఆదాయం చేకూరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి


బాధితుడితో మాట్లాడుతున్న వైద్యాధికారులు

గోస్పాడు: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలాజీ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రోగులకు సకాలంలో సరైన వైద్యం అందించాలన్నారు. క్షయ వ్యాధితో బాధపడుతున్న రోగులకు గ్రామాల్లో వైద్య సిబ్బంది సకాలంలో మందులు అందేలా చూడాలన్నారు. దీర్ఘ కాలికంగా వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి గ్రామాల్లో ప్రత్యేకంగా చేపడుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో సేవలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆరోగ్యంద్రానికి రోగులు ఎంతమంది వస్తున్నారు, వారికి సరైన మందులు అందుబాటులో ఉన్నాయా.. లేదా? ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ, ల్యాబ్ పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం క్షయ బాధితుల ఇళ్ల వద్ద వెళ్లి వైద్యసేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరినీ ఆదుకోని కేంద్ర బడ్జెట్

నంద్యాల(అర్బన్): కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగులు, రైతులు, కార్మికులకు కేంద్ర ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు విమర్శించారు. సీపీఎం, సీపీఐ, సీఐటీయూ, పీడీఎస్‌యూ నాయకులు రమేష్‌కుమార్, రంగనాయుడు, నాగరాజు, రఫీ బుధవారం వారి కార్యాలయాల్లో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగాల భర్తీ ప్రస్తావనే లేకపోవడం దుర్మార్గమన్నారు. రుణ విమోచన పథకం బడ్జెట్‌లో ఉంటుందేమోనన్న ఆశతో ఎదురు చూసిన రైతులకు నిరాశే ఎదురైందన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు ఏమాత్రం తగ్గించకపోవడం దారుణమన్నారు. నిత్యావసర సరుకుల ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని, కార్పొరేట్ సంస్థలకు లాభాలు తెచ్చే విధంగా బడ్జెట్ ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు.

4న బైకుల వేలం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్టేషన్ పరిధిలో సరైన రికార్డులు లేని 25 బైకులను ఈనెల 4వ తేదీన వేలం వేస్తామని సీఐ కృష్ణయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాహనాల తనిఖీల్లో సరైన రికార్డులు లేకుండా పట్టుబడిన బైకులకు వేలం వేస్తామని, ఎవరైనా సరైన రికార్డులు కలిగి ఉంటే తమను సంప్రదించి రికార్డులు సమర్పించాలని కోరారు. రికార్డులు సమర్పించని వాహనాన్ని వేలంలో ఉంచుతామని స్పష్టం చేశారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(సిటీ): వార్డెన్ వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు కోరారు. బుధవారం పట్టణంలోని పద్మావతినగర్ కూడలిలో సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బొమ్మల సత్రం ఎస్సీ హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు సమయపాలన పాటించకుండా, మెనూ సక్రమంగా అమలు చేయకుండా విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందించాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సంఘం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సిసింద్రీ, శివ, నాయకులు ప్రవీణ్, బాలు, అరవింద్, ప్రణయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

రవీంద్రారెడ్డి గెలుపు కోరుతూ విస్తృత ప్రచారం


ప్రచార పత్రాలు అందజేస్తున్న అడ్వకేట్ రామిరెడ్డి

ఆళ్లగడ్డ: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలిపునకు ఉద్యోగ పట్టభద్రులు, విద్యార్థులు సహకరించాలని ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రచారకర్త సిరిగిరి రామిరెడ్డి కోరారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో ఆయన బుధవారం ప్రచారం చేశారు. వివి శ్రీనివాసులు, చిట్టిబాబు, విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గడివేముల: ఉద్యాన పంటల్లో సస్యరక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించొచ్చని జిల్లా హార్టికల్చర్ అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం ఎల్‌కే తండా పరిధిలో సాగు చేసిన మామిడి, చీని తోటను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. హెచ్ఆర్ఎస్ శాస్త్రవేత్త సుబ్రమణ్యం, ఏఓ హేమసుందర్‌రెడ్డి, నాబార్డ్ అధికారి హబీబ్, గని సర్పంచ్ కత్తి తులషమ్మ, ఉపసర్పంచ్ శివానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరిగా పాటించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ

ఆళ్లగడ్డ: ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఉప విద్యాధికారి మహబూబ్‌బేగ్ సూచించారు. బుధవారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆయన పదో తరగతి విద్యార్థుల నోట్‌పుస్తకాలు, వర్క్‌బుక్స్, టీచర్ల లెసన్‌ప్లాన్, డైరీలను పరిశీలించారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందకు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అలాగే ఉపాధ్యాయులతో మాట్లాడి ఫలితాల మెరుగుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

రామచంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం


మాట్లాడుతున్న రమణారెడ్డి

ఆళ్లగడ్డ: త్వరలో జరగనున్న ఎన్నికల్లో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఎంవీ రామచంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అపుస్మ(ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ అసోసియేషన్)రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, హెచ్ఎంలను కలిశారు. ఆయన మాట్లాడుతూ రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వంతో చర్చించి వెంటనే పరిష్కరిస్తారని హామీనిచ్చారు. గెలుపుకోసం అందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, అమీర్‌బాషా, సుబ్రహ్మణ్యం, నంద్యాల జిల్లా జనరల్ సెక్రటరీ దస్తగిరి, వెంకటస్వామి, ఇసాక్, హుసేన్‌బాషా, మల్లికార్జున పాల్గొన్నారు.

ఏపీపీగా గోపాల కృష్ణారెడ్డి



నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన వైవీ గోపాల కృష్ణారెడ్డి ఏపీపీగా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ నియామకంపై ప్రిన్సిపల్ సెక్రటరీ హరికుమార్ గుప్త నుంచి ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. పట్టణంలో 21 సంవత్సరాలుగా క్రిమినల్ న్యాయవాదిగా కొనసాగుతున్నానని, ఈ పదవీ కాలం మూడు సంవత్సరాల పాటు ఉంటుందని చెప్పారు. బాధ్యతలు స్వీకరించి పేదలకు మరింత న్యాయసేవలను అందించడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ నాయకులు రామసుబ్బయ్య, ప్రతాప్‌రెడ్డి,రమేష్, పెద్ది శ్రీనివాసులు, ముక్కెర కృష్ణారెడ్డి, నూక జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

స్పందన అర్జీల పరిష్కారంపై దృష్టి సారించండి

రుద్రవరం: గ్రామ సచివాలయాల్లో స్పందన దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని 16 గ్రామ సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు మండల కేంద్రాలకు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చిందన్నారు. ఆ సచివాలయాల్లో విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించి, హాజరు వేయడంతో పాటు వలంటీర్ల హాజరు కూడా వేయించాలని చెప్పారు. అలాగే రోజూ ప్రతి సచివాలయం నుంచి 10 సర్వీసులైనా చేయాలని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులు, వాటికి సంబంధించి ఆయా గ్రామాల్లో సాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈఓఆర్డీ భాగ్యలక్ష్మి, పీఆర్ ఏఈ వెంకటరాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

వైభవంగా ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం


బుక్కాపురంలో ధ్వజానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి సదానంద స్వామి, భక్తులు

మహానంది: బుక్కాపురం సమీపంలోని శ్రీ ఉమామహేశ్వర గురుపీఠం, శ్రీ శివ,పార్వతీ ఆలయం వద్ద బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. పీఠాధిపతి శ్రీ సదానంద స్వామి ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు ఉదయం నుంచి గణపతిపూజ, జలాధివాసం, ధాన్యాధివాసం పూజల అనంతరం ధ్వజప్రతిష్ఠ, నవగ్రహాల మూర్తుల ప్రతిష్ఠ వైభవంగా చేపట్టారు. అలాగే గాజులపల్లె రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీ గంగా, గౌరీ సమేత మరకతలింగేశ్వర, నవగ్రహాల దేవాలయంలో ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి.

సత్తాచాటిన పెద్దకొట్టాల వృషభాలు


ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల యజమాని బోరెడ్డి కేశవరెడ్డికి నగదు బహుమతి అందజేస్తున్న ఆలయ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్‌రెడ్డి

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవరాయ స్వామి ఆలయ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి న్యూ కేటగిరీ విభాగం బండలాగుడు పోటీలలో నంద్యాల జిల్లా పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు 6581 అడుగులు లాగి ప్రథమస్థానంలో నిలిచి రూ. 50వేలు గెలుచుకున్నాయి. నంద్యాల జిల్లా డోన్ తాలూకా గొర్లగుట్ట గ్రామానికి చెందిన ఎంజీవీఆర్ బుల్స్ బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, చిన్న నెలటూరుకు చెందిన గాజుల కుమార స్వామి(కంబైన్డ్ జత) వృషభాలు రెండవ స్థానంలో నిలిచి రూ. 40వేలు, ప్రకాశం జిల్లా దర్శికి చెందిన గానుపెంట రాజశేఖర రెడ్డి ఎద్దులు, నంద్యాల జిల్లా వనికందిన్నె గ్రామానికి చెందిన తలారి పెద్ద శరభయ్య వృషభాలు మూడు, నాలుగు స్థానాల్లో సమానంగా నిలిచి రూ. 50 వేలను రూ. 25 వేల చొప్పున, ప్రకాశం జిల్లా బురుజుపల్లి గ్రామానికి చెందిన ఎర్రమల సోహిత్ రెడ్డి వృషభాలు ఐదవ స్థానంలో నిలిచి రూ. 10 వేలు, నంద్యాల జిల్లా జిల్లెల్ల గ్రామానికి చెందిన నాగిరెడ్డి ఎడ్లు ఆరో స్థానంలో నిలిచి రూ. 5 వేలు నగదును అందుకున్నట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ నాగారెడ్డి రామస్వామిరెడ్డి, మాజీ సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.